బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

కడప కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసినా, పుట్టబోయే బిడ్డ పట్ల లింగ వివక్ష చూపినా కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రారంభించారు. ఐటీఐ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో వచ్చే అనారోగ్య సమస్యలు, కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులు, మాతా శిశు మరణాలను గురించి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ ఉమామహేశ్వరరావు, డీపీఎంఓ శశిభూషణం, డీఎల్‌ఏటీఓ రవి, డాక్టర్లు వెంకటచంద్రారెడ్డి, రమేశ్, ఉబేదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15నాటికి బస్సులు కండిషన్‌లో ఉంచాలి: ఆర్‌ఎం


బస్సును పరిశీలిస్తున్న ఆర్‌ఎం గోపాల్ రెడ్డి

బద్వేలు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభిస్తున్నందున ఆ రోజుకు బస్సులను కండిషన్‌గా ఉంచాలని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు ఆర్టీసీ డిపోలోని బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫిర్యాదులు రాకుండా బస్సులను పూర్తిస్థాయి కండిషన్‌లో ఉంచాలన్నారు. డిపోలోని బస్సులను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డీఎం నిరంజన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా గుల్ల

పెన్నా నదిలో వాటర్ వర్క్స్ వద్ద ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న దృశ్యం



- నిషేధిత వాటర్ వర్క్స్ వద్దా ఇసుక తవ్వకాలు
- లక్షల జనాభా తాగునీటికి పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు

ప్రొద్దుటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఉన్న ఏకైక తాగునీటి వనరు పెన్నానది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ నదిలోని ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరిపి బెంగళూరు, హైదరాబాదుకు తరలించి కోట్లు గడించారు. దీంతో పెన్నానదిలో ఇసుక మేటలు తరిగిపోయి నది స్వరూపమే మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక వనరును ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చారు. వైసీపీ హయాంలో నదిలోనుంచి విచ్చలవిడిగా ఇసుక తరలించగా మిగిలి ఉన్న కొద్దిపాటి ఇసుకనూ ఇప్పుడు అక్రమంగా తవ్వేస్తున్నారు. ఇందులో వైసీపీ, టీడీపీ అని తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఆఖరికి పట్టణాలకు తాగునీటిని అందించే వాటర్‌వర్క్స్ బావుల సమీపంలో కూడా ఇసుకను తవ్వేస్తున్నారు.

అక్రమ రవాణా అరికడతాం

ప్రొద్దుటూరు వద్ద పెన్నానదిలో ఎక్కడా ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ఎర్రగుంట్ల బ్రిడ్జి నుంచి రామేశ్వరం రైల్వే వంతెన వరకు పెన్నానదిలో ఎక్కడ ఇసుక తవ్వకాలు జరిపినా కేసులు నమోదు చేస్తాం. పోలీసులతో కలిపి ఇసుక నిఘా టీంలను వేసి అక్రమ రవాణాను అరికడతాం.

- వండాడి గంగయ్య, తహశీల్దారు, ప్రొద్దుటూరు

నిషేధిత ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు

ప్రొద్దుటూరు వద్ద పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ఐదేళ్ల క్రితమే ప్రొద్దుటూరు పెన్నానదిలో భూగర్భజలాలకు డేంజర్‌బెల్స్ మోగటంతో మైన్స్‌అండ్ జియాలజీ విభాగం అధికారులు తాగునీటికి ముప్పు వాటిల్లుతుందని నివేదికలు ఇచ్చారు. అందువల్ల ఇక్కడ పెన్నా నదిలో ఇసుక తవ్వకాలను అనుమతులు ఇవ్వలేదు. ఎర్రగుంట్ల రోడ్డు హైలెవెల్ బ్రిడ్జి నుంచి రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద గల రైల్వే బ్రిడ్జి వరకు నదిలో ఎక్కడా ఇసుక తవ్వకాలు జరపరాదని జనవరి 25వ తేదీన తహశీల్దారు వండాడి గంగయ్య ప్రకటించారు. ఆమేరకు ఈ వీఆర్వోలతో నిఘా టీంలను ఏర్పాటు చేసి కొద్దిరోజులు ఇసుక అక్రమ రవాణా సాగకుండా చర్యలు తీసుకున్నారు. కానీ రెవెన్యూకు తోడుగా పోలీసు అధికారులు సహకరించకపోవడం, అధికార పార్టీ నుంచి ఒత్తిళ్ల కారణంగా తహశీల్దారు వదిలేశారు. దీంతో ఈ ఆరు నెలల్లోనే నదిలోని నిషేధిత ప్రాంతంలో ఇసుక నిల్వలు పూర్తిగా మాయమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు రామేశ్వరంలోని రైల్వే బ్రిడ్జికి సమీపంలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో రైల్వే వంతెనకు కూడా ప్రమాదం పొంచి ఉంది.

ఎమ్మెల్యే వరద హామీ గాలికి

వైసీపీ హయాంలో ఇసుక దందా సాగుతోందని, తాము అధికారంలోకి వస్తే ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని గత ఏడాది ఎన్నికల సమయంలో వరదరాజులరెడ్డి ప్రొద్దుటూరు ప్రజలకు హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. రెవెన్యూ అధికారులు పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని ప్రకటించారు. అయినా ఇక్కడ ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. రెవెన్యూ, పోలీసు అధికారులను నిత్యం అప్రమత్తం చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని చెప్పాల్సిన ఎమ్మెల్యే మౌనం దాల్చడంతో అధికారులు సైతం చేతులెత్తేశారని అంటున్నారు.


వాటర్ వర్క్స్ వద్ద పెన్నానదిలో అడుగంటిపోతున్న ఇసుక

శాకంబరిగా వాసవీమాత



కడప కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని అమ్మవారిశాల వీధిలో ఉన్న వాసవీకన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకుముందు తెల్లవారుజామున 2 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకము, ఉదయం 8 గంటలకు కుంకుమార్చన, అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరైన అమ్మవారిని దర్శించుకున్నారు.

క్రీడాపాఠశాల ఎంపికలకు 36 మంది హాజరు


రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ క్రీడాపాఠశాలలో 5వతరగతి ప్రవేశానికై శుక్రవారం కడప డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలకు 36 మంది హాజరయ్యారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 51 మంది బాల, బాలికలు అర్హత సాధించగా వీరిలో 36 మంది హాజరయ్యారని తెలిపారు. సరైన సమయానికి 13 మంది హాజరుకాలేదని, మెడికల్ టెస్ట్‌లో ఇద్దరు అనర్హులుగా తేలారని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపిస్తామన్నారు. వివిధ కారణాలతో ఈనెల 9వ తేదీన జరిగిన 4వ తరగతి ప్రవేశానికి సకాలంలో రాని ఇద్దరు శుక్రవారం హాజరయ్యారని తెలిపారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు

- మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత
- బ్రాందీషాపుల వద్ద మద్యం తాగకుండా చర్యలు
- నేరసమీక్ష సమావేశంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



కడప క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి నిర్మూలనకు పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాను గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల రహితంగా చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని ఆదేశించారు. గంజాయి చేవించే ప్రాంతాలను డ్రోన్ కెమెరాతో గుర్తించి నిఘా పెంచాలని సూచించారు. మిస్సింగ్ కేసులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.. మహిళల ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచి పల్లె నిద్ర, కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించాలని, బెట్టింగ్, జూదం, మట్కాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణను వేగవంతం చేయాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. కాగా.. ఇటీవల పలు కేసుల్లో నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ వినయ్ కుమార్ రెడ్డితో పాటు ఏడుగురు పోలీస్ సిబ్బందికి, చోరీ కేసుల్లో రికవరీ చేయడంలో బాగా పనిచేసిన సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- 16 నూతన వాహనాలు ప్రారంభం : ఎస్పీ


నూతన ద్విచక్ర వాహనాలతో పోలీసులు

కడప క్రైం జూలై 11 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ కోసం పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఒక బుల్లెట్ వాహనం, 15-అపాచి ఆర్టీఆర్ ద్విచక్ర వాహనాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రారంభించారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఈ వాహనాలను సైరన్, బ్లింకర్స్ పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు 7, ప్రొద్దుటూరు ట్రాఫిక్ పీఎస్‌కు 4, పులివెందుల ట్రాఫిక్ పీఎస్‌కు 2, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలుకు ఒక్కొక్కటి చొప్పున నూతన వాహనాలు కేటాయిస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని భావిస్తున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు ఎస్.సుధాకర్, ఇ.బాలస్వామి రెడ్డి, అబ్దుల్ కరీం, ఎ.వెంకటేశ్వర్లు, పి.భావన, రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రావు, మురళీనాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కబ్జా భూములను పరిశీలించిన ఆర్డీవో


కబ్జాకు గురైన భూముల వద్ద గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమౌళి

బి.కోడూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మునెల్లి రెవెన్యూ పొలంలో కబ్జాకు గురైన భూములను శుక్రవారం బద్వేలు ఆర్డీవో చంద్రమౌళి పరిశీలించారు. గోవిందాయపల్లె గ్రామస్థులు తమ గ్రామానికి వారసత్వంగా వస్తున్న పొలం అన్యాక్రాంతమైందని సుపరిపాలనలో తొలిఅడుగు సందర్భంగా బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేశ్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన ఈ విషయం ఆర్డీవోకు చెప్పారు. స్పందించిన ఆర్డీవో శుక్రవారం తహశీల్దారు దస్తగిరితో కలిసి మునెల్లి రెవెన్యూ పొలంలోని సర్వే నెంబర్లు 753 , 755, 767లో కబ్జాకు గురైన దాదాపు 20 ఎకరాల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ దొంగ పట్టాదారు పాసుపుస్తకాలు, డీ ఫారాలను సృష్టించుకుని ఆన్‌లైన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయం జిల్లా అధికారులకు, కోర్టు దృష్టికి తీసుకుపోవడంతో పాటు ఆన్‌లైన్‌లో పేర్లు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి కేసులో హైకోర్టు ఉత్తర్వులు

41 నోటీసు ఇచ్చి విచారణ చేయాలని సూచన ● 11 మందిని కోర్టుకు పంపగా వెనక్కి పంపిన జడ్జి 7

నిర్వాసితులకు త్వరలోనే పరిహారం

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి


రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, చిత్రంలో భూపేశ్‌రెడ్డి, బీటెక్‌రవి తదితరులు

కొండాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు త్వరలోనే పరిహారం అందుతుందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు, సుగుమంచిపల్లె, కొండాపురం, ఓబన్నపేట పంచాయతీలకు చిత్రావతి నది నుంచి రూ.7.16 కోట్లతో చేపట్టనున్న మంచినీటి పైపులైను నిర్మాణ పనులను జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని అన్నారు. వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. గండికోట ప్రాజెక్టు నుంచి కొండాపురం మండలంలోని అన్ని గ్రామాలకు నీరందించేదుకు రూ.71 కోట్లతో త్వరలో పనులు చేపడతామన్నారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతాలకు వారం రోజుల్లో నీరందిస్తామని తెలిపారు. భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాలను తమ ప్రభుత్వం అమలుచేసి తీరుతుందని అన్నారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ జలజీవనన్ మిషన్ కింద పులివెందుల మున్సిపాలిటీకి నీరందించామని అన్నారు. అనంతరం వీరు ఏటూరు రైతు సేవా కేంద్రం పరిధిలో జొన్న, రాగి, సోయాచిక్కుడు, కంది విత్తనాల మినీకిటను మండలంలోని రైతులకు పంపిణీ చేశారు. ఉచితంగా అందజేసే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రనాయక్, ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో నాగప్రసాద్, తహశీల్దార్ గురప్ప, ఏవో రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రక్షాళన దిశగా..

- డిగ్రీ కళాశాలలపై ప్రభుత్వం దృష్టి
- 25శాతం కంటే తక్కువగా అడ్మిషన్లు ఉంటే అనుమతి రద్దు
- ఇప్పటి వరకు ప్రారంభం కాని అడ్మిషన్లు
- ఆందోళనలో యాజమాన్యాలు



కడప ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం డిగ్రీ కళాశాలల ప్రక్షాళనపై దృష్టి సారించింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చే దిశగా చర్యలు ప్రారంభించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వారి భవిష్యత్తు దృష్ట్యా కొన్ని సంస్కరణలు తీసుకువచ్చే దిశగా ఆలోచనలు చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 25శాతం కంటే తక్కువ అడ్మిషన్లు ఉన్న డిగ్రీ కళాశాలలపై దృష్టిసారించింది. ఆ తరహా కళాశాలల జాబితాను సిద్ధం చేసింది. వీటికి ఉన్నత విద్యామండలి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ప్రత్యేక కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని అందులో సూచించింది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత వాటి అనుమతులపై స్పష్టత వస్తుంది.

రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో ఉన్న మొత్తం డిగ్రీ సీట్లలో 30శాతం కూడా భర్తీ కావడం లేదు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే డిగ్రీకళాశాలలు డేంజర్ జోన్‌లో ఉన్నాయని చెప్పాలి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వృత్తి నైపుణ్య కోర్సుల వైపు మొగ్గు చూపడం తో డిగ్రీ చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 71 కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కళాశాలలు 14, ప్రైవేట్ 52, ఎయిడెడ్ 5 ఉన్నాయి. వీటిలో 5 కళాశాలల్లో అసలు అడ్మిషన్లే లేవు. మరికొన్ని కళాశాలల్లో ఏదో ఒక కోర్సులో గాని, మొత్తం కోర్సుల్లో 25శాతం కంటే తక్కువ అడ్మిషన్లు ఉన్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. 25శాతం కంటే తక్కువగా అడ్మిషన్లు ఉన్న కళాశాలల అనుమతి రద్దు చేస్తారని అంటున్నారు. ఈ తరుణంలో నిర్వాహకులు అడ్మిషన్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు ఇంకా మొదలుకాకపోవడంతో కళాశాలల అనుమతులు పొందాలంటే ఆయా కోర్సుల్లో 25శాతం మంది విద్యార్థులు చేరాల్సిన పరిస్థితి.

డేంజర్‌లో డిగ్రీ

ఎక్కువగా ఇంటర్ తర్వాత ఇతరవృత్తులు నేర్చుకుంటూ, వేరేచోట పనిచేస్తూ దూరవిద్య ద్వారా డిగ్రీ చదివేందుకు ఇష్టపడుతున్నారు. దీనితో చాలా డిగ్రీ కళాశాలలు రెగ్యులర్ డిగ్రీతో పాటు దూరవిద్యాకోర్సులకు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. వాటి ద్వారా ఏటా దూరవిద్యలో రెండు వేల మందికి పైగా విద్యార్థులు డిగ్రీలు పూర్తిచేస్తున్నారు. మరోవైపు జూలై నెల ప్రారంభమై రెండు వారాలు అవుతున్నా ఇప్పటికీ అడ్మిషన్లు మొదలు కాకపోవడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఇంటర్ విద్యామండలి ఇంటర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఇప్పటికే ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు వృత్తి విద్యాకోర్సుల్లో చేరిపోయారు. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే డిగ్రీ అడ్మిషన్లు ఇంకా ప్రారంభం కాకపోవడానికి ప్రధాన కారణం కళాశాలల ప్రక్షాళన అని చెప్పవచ్చు.

ఆ రెండు గ్రూపులకే డిమాండ్

బీఏ, బీకాం, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఏ హిస్టరీ వంటి 70 వరకు బ్రాంచ్‌లు ఉన్నాయి. అన్నింటిలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్స్ కోర్సులకే అధిక డిమాండ్ ఉంది. మిగిలిన బ్రాంచిల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకు రాకపోవడంతో వాటిని ప్రాధాన్యత సన్నగిల్లింది. కాగా.. తమ పిల్లలు మంచి ఉద్యోగం సాధించి, జీవితంలో స్థిరపడాలని అనుకునే వారు ఎక్కువగా ఇంజనీరింగ్, వృత్తినైపుణ్య కోర్సులవైపే మొగ్గు చూపుతున్నారు. ఇంటర్‌లో సీఈసీ వంటి కోర్సులు తీసుకుని, ఇతర వృత్తి నైపుణ్య కోర్సుల్లో చేరేందుకు అవకాశం లేని విద్యార్థులే డిగ్రీ చేరుతున్నారు. దీనితో ప్లస్-2 తర్వాత ఆర్ట్స్ చదివే వారు కనిపించడం లేదు. దీనితో డిగ్రీ కళాశాలలు అడ్మిషన్స్ లేక వెలవెలపోతున్నాయి.

నేడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాక

వాల్మీకిపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఉదయం వాల్మీకిపురం మండలంలోని కంభంవారిపల్లెకు రానున్నారు. కంభం ప్రభాకర్‌రెడ్డి మరణవార్త తెలుసుకున్న తక్షణం ఆయన ఫోన్ ద్వారా ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబీకులకు ఓదార్పు చెప్పారు. కాగా శనివారం ఉదయం జరగనున్న ప్రభాకర్‌రెడ్డి అంత్యక్రియలకు నేరుగా ఆయన హాజరు కానున్నారు.

దాడిపై కేసు నమోదు

సుండుపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిచెరువుకు చెందిన వరుణ్‌పై దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మడితాడు గ్రామంలో కారులో వస్తుండగా కొంత మంది యువకులు కారును అడ్డుకొని కర్రలతో దాడి చేసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సుండుపల్లె మండలానికి చెందిన సుమారు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అల్లర్లు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెల్నెస్ సెంటర్‌తో వెలుగు

- అంతర్జాతీయ గుర్తింపు పొందనున్న హార్సిలీహిల్స్
- పెరగనున్న పర్యాటకుల సంఖ్య
- మెరుగుపడనున్న మౌలిక సదుపాయాలు



బి.కొత్తకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌కు వెల్నెస్ సెంటర్‌తో వెలుగు రానుంది. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ యోగా గురువు పతంజలి సంస్థ వ్యవస్థాపకుడు రాందేవ్‌బాబాను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి సంస్థ కార్యకలాపాలు సాగించాలని అందుకు తగిన వెసులుబాటు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. అందుకు రాందేవ్‌బాబా కూడా సానుకూలంగా స్పందించి ఇటీవల రాష్ట్రంలో తన బృందంతో పర్యటించి కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబుతోనూ సమావేశమయ్యారు. ఇప్పటికే దేశ విదేశాల్లో నిర్వహిస్తున్న వెల్నెస్ సెంటర్ తరహాలో రాష్ట్రంలోనూ ఏర్పాటుకు ముందుకొచ్చారు. అందులో సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి అందాలు కలిగి వున్న హార్సిలీహిల్స్ ఒకటి.

హిల్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు..

పతంజలి సంస్థకు దేశవ్యాప్తంగా హరిద్వార్ (ఉత్తరాఖండ్), నోయిడా, మోదీనగర్ (ఉత్తరప్రదేశ్), గౌహతి (అస్సాం), పానిపట్ (హర్యానా), పూణే (మహారాష్ట్ర), జబల్‌పూర్ (మధ్యప్రదేశ్), ఆనంద్ (గుజరాత్) తదితర ప్రాంతాల్లో వెల్నెస్ సెంటర్లు ఉన్నాయి. అయితే వాటిలో హిల్‌స్టేషన్ లేదు. హార్సిలీహిల్స్‌లో కనక ఏర్పాటైతే దానికో ప్రత్యేకత ఉండబోతోంది. దేశ విదేశాల నుంచి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలోనే మదనపల్లెకు మినీ ఎయిర్‌పోర్ట్ తీసుకువస్తామని రాకపోకలకు సౌకర్యాలు కల్పిస్తామని స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. హార్సిలీహిల్స్‌లో రూ.200 కోట్లతో ఒబెరాయ్ సంస్థకు ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయించినా ప్రాజెక్టు స్థాపన ఆలస్యం అవుతోంది. దీంతో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం దారులు తెరిచినట్లు తెలుస్తోంది.

వెల్నెస్ సెంటర్‌తో సాంత్వన

శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సు సమగ్ర ఏకీకరణ, మానసిక ప్రశాంతత, మనస్సును నిమగ్నం చేసి సాంత్వన పొందటమే వెల్నెస్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యం. బీపీ, థైరాయిడ్, మధుమేహం లాంటి రుగ్మతలకు ప్రకృతి వైద్యం, ఆయుర్వేద మందులు, యోగా ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. పరిస్థితిని బట్టి ఔత్సాహికులు తమ పేర్లను నమోదు చేసుకొని సంస్థ నిబంధనల మేరకు సేవలు పొందవచ్చు. పర్యాటక పరంగా ఆదాయం ఉన్నప్పటికీ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని హార్సిలీహిల్స్‌లో మౌలిక సదుపాయాలు, భద్రత, సుందరీకరణతో మెరుగుపడుతుందని పలువురు భావిస్తున్నారు.

14న మంత్రుల పర్యటన

కురబలకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డిలు పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంగళ్లు, ముదివేడు క్రాస్, దాదాంవారిపల్లె పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాగా కడప క్రాస్ పంచాయతీ ఒంటిల్లు తూర్పు హరిజనవాడ వద్ద ఆర్‌డీ ఎస్ రూ.30 లక్షల నిధులతో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవం, ముదివేడు కేజీబీవీలో రూ.11లక్షల నిధులతో పాఠశాల భవన నిర్మాణం శంకుస్థాపన, దాదంవారిపల్లె పంచాయతీలో రూ.10 లక్షల ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, గొళ్లపల్లెలో రూ.21 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, అంగళ్లు పంచాయతీ టెర్రకోట వద్ద డీఆర్‌డీఏ నిధులతో నిర్మించిన కామన్ ఫెసిలిటి కేంద్రం ప్రారంభం, అంగళ్లు పంచాయతీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, రూ.80 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సచివాలయం, రైతుసేవా కేంద్రం, ప్రహరీ, అంగళ్లు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.10లక్షల నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష

రామసముద్రం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువడినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రామసముద్రం-మదనపల్లె రోడ్డులో ఓబినాయనపల్లె బస్ షెల్టర్ వద్ద 6-10-2012న ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వనగానిపల్లెకు చెందిన రామప్ప మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఏటవాకిలి గ్రామానికి చెందిన వైవీ చెంగారెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ నేపథ్యంలో 2018 నవంబరు 22 పుంగనూరు కోర్టు నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. దీన్ని సవాల్ చేస్తూ నిందితుడు మదనపల్లె కోర్టులో అప్పీలు చేసుకున్నాడు. అయితే శుక్రవారం కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మదనపల్లె కోర్టు కూడా అదే శిక్షను అమలు చేయాలని తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యానికి నడక మంచిదే



జెండా ఊపి ప్రారంభిస్తున్న ముంతాజ్‌అలి, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర

మదనపల్లెటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మానవుడి ఆరోగ్యానికి నడక మంచిదే అని పద్మభూషణ్ అవార్డు గ్రహీత ముంతాజ్ అలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సత్సంగ్ ఫౌండేషన్, స్వస్థ ఆస్పత్రి ఆధ్వర్యంలో 3 కి.మీ. వాకతాన్ నిర్వహించారు. ఈ వాకతాన్‌ను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర జెండా ఊపి ప్రారంభించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు 4 కి.మీ. నడిస్తే రోగాల పేరిట ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం వుండదన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వ్యాయామానికి ముందు నడక ఒక ఔషధంలా పనిచేస్తుందన్నారు. అనంతరం సత్సంగ్ ఆశ్రమం నుంచి 3 కి.మీ. పాటు విద్యార్థులు, ప్రజలు వాకతాన్ నిర్వహించారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక, ఆరోగ్యమాత, సత్సంగ్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్దేశ్వర, చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం



గజ వాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వరస్వామి

రాజంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ఇలవేల్పు అయిన చెన్నకేశవ, సిద్దేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గజ వాహనంపై సిద్దేశ్వరస్వామిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో తాళ్లపాక గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీతోనే యూనియన్ ఆవిర్భావం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య
- వన్ అండ్ టూ డిపోల గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి



యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలిని సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

మదనపల్లెఅర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): 1952లో ఆర్టీసీ సంస్థ ఆవిర్భావంతోనే యూనియన్ ఏర్పాటైందని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడిగా టీడీపీ నేత నాగూర్‌వలిచే ప్రమాణం చేయించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు రాష్ట్ర, జిల్లా నేతలు కలిసి సన్మానించారు. అంతకముందే కొమటివాని చెరువు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి ర్యాలీగా మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ చేరుకున్నారు. సీఏ బాబు సభాధ్యక్షతన నిర్వహిస్తున్న సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక నేత సుధాకర్, మలిశెట్టి దామోదర్ జీతాల పెంపుకోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం రాష్ట్ర నేత మలిశెట్టి దామోదర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమార్‌లు మాట్లాడారు. నూతన గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ అందరి సహకారంతో ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కృష్ణప్ప, మురళి, జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, కల్యాణ్, సురేంద్ర, టీడీపీ నేతలు ఖాదర్‌ఖాన్, సుధాకర్, రామమూర్తి నాయుడు, లక్ష్మన్న, వెంకటరమణారెడ్డి, మధుబాబు, మేస్త్రీ రామకృష్ణ, ఐదు డిపోల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్టీసీ మహిళ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై రహస్య విచారణ

సిద్దవటం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత పాలన వైసీపీలో ఆర్బీ సంస్థ అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించి గుత్తేదారుని సమయం గడిచినా ఇసుక తవ్వకాలు జరపడంపై పెన్నానదిలో హద్దులు మీరి తవ్వకాలు, మరొకచోట జరిపి కోట్ల రూపాయలు అడ్డగోలుగా సంపాదించిన ఇసుక బకాసురులపై రహస్య విచారణ జరుగుతోంది. ఈ రహస్య విచారణ విజయవాడ ఏసీబీ అధికారులు జ్యోతి, వంతాటిపల్లె, జంగాలపల్లె, మూలపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. సిద్దవటం మండలంలో వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల్లో వైసీపీ ప్రజాప్రతినిధుల ప్రమేయం ఎంతవరకు ఉంది, మరెవరెవరు ఈ ఇసుక కుంభకోణాల్లో ఉన్నారు పూర్తిగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

ఆ మూడు.. సారారహిత గ్రామాలు



సీటీఎం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మదనపల్లెటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని సీటీఎం, పోతబోలు, ములకలదిన్నె గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు ప్రజలతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 ద్వారా నాటుసారా తయారీని వదిలేసిన ప్రజలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందన్నారు. దీని వలన వారి జీవన విధానం మారి సమాజంలో గౌరవంగా బతకవచ్చన్నారు. అందుకే ఈ మూడు గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, సేవించరాదన్నారు. అలాగే పాత నిందితులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నామన్నారు. ఇక మీదట ఈ మూడు గ్రామాల్లో నాటుసారా విషయమై సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, హెచ్‌సీ వీరనాగయ్య, పీసీలు రేఖ, శివరాణి, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

చౌకదుకాణంపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సంబేపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరెడ్డి పల్లె గ్రామం షాప్ నెంబర్-1 పేయల వాండ్లపల్లె చౌక దుకాణంపై విజిలెన్స్ అధికారులు గీతావాణి, ఖాజా హుస్సేన్ శుక్రవారం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డితో కలిసి దాడులు నిర్వహించారు. చౌకదుకాణంలో ఉండాల్సిన స్టాక్ కన్నా తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి షాప్ నెంబర్-1 సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా చేయక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

చౌకదుకాణంపై విచారణ

సిద్దవటం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె చౌకదుకాణంలో రేషన్‌దారులకు సక్రమంగా నిత్యావసర వస్తువులు అందడం లేదని, మరికొన్ని అక్రమాలు జరుగుతున్నాయని కొందరు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం పి.కొత్తపల్లె రేషన్‌షాపు-4పై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య మాట్లాడుతూ చౌకదుకాణం-4లో రేషన్ లబ్ధిదారునికి 5కిలోలు అందించాల్సి ఉండగా నాలుగు కిలోలు ఇస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్‌బాబు, వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేరళ పోలీసుల అదుపులో మదనపల్లె యువతి

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనం

మదనపల్లె అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె యువతిని కేరళ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణం నక్కలదిన్నెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నక్కలదిన్నె వాసి సాయిబాబా కుమార్తె రోహిణి (27) 2023లో కేరళ రాష్ట్రం ముక్కంలో ఇతరులను మోసం చేయడంతో అక్కడి పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈమె తప్పించుకుని తిరుగుతూ కొద్ది రోజులుగా మదనపల్లెలో ఉంటోంది. సమాచారం తెలుసుకున్న కేరళ పోలీసులు శుక్రవారం నక్కలదిన్నెలో ఇంటి వద్ద అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె విషద్రావణం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అరెస్టు చేసి కేరళకు తరలించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పించాలి

రాజంపేటటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల్లో రాయితీ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, తాలుకా అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఏపీయూడబ్ల్యూజే రాజంపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంఈవో రఘునాథరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట మండల కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల ఫీజుల్లో 50శాతం మేరకు రాయితీ ఇవ్వాలని, కలెక్టర్ విడుదల చేసిన ఉత్తర్వులను ప్రైవేటు పాఠశాలలు విధిగా అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మలిశెట్టి సుబ్బరాయుడు, త్రివిక్రమ్, రాజంపేట ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాణ్, శ్రీహరి, వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్ర, ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వన్యప్రాణి మృతి



మృతి చెందిన వన్యప్రాణి

రావాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు సమీపంలో శుక్రవారం రోడ్డు దాటుతున్న వన్యప్రాణిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి భరణికుమార్ తెలిపారు. మృతిచెందిన జింకను పోస్టుమార్టం నిమిత్తం రామాపురం పశువైద్యశాలకు తరలించి, అనంతరం అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లి దహనం చేసినట్లు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లెటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఆంధ్రలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ బీఎంపీపీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వేకువజామున బీఎంపీపీ సీఐ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో బెంగళూరు రోడ్డులోని చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కురబలకోట మండలం తుంగావారిపల్లెకు చెందిన ఎం.చంద్ర కుమారుడు ఎం.రమేశ్(27) కర్ణాటక నుంచి ద్విచక్రవాహనంలో 96 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేశారు. తుంగావారిపల్లెకు చెందిన పి.రామచంద్ర కుమారుడు పి.సోమశేఖర్(20) వద్ద 48 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు నిమిత్తం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.



మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

సాకులు చూపి కోతలు

- గృహనిర్మాణ పథకంలో జిల్లాలో 7652 మంది అనర్హులుగా గుర్తింపు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

పట్టాదారుని పేరు : మద్దిరాల వీరయ్య
తండ్రి/ భర్త పేరు : చిన్న వెంగయ్య
ఖాతా నెంబరు : 903 సర్వే నెం. : 596-3
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 1.63
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :
1

పట్టాదారుని పేరు : మద్దిరాల వీరయ్య
తండ్రి/ భర్త పేరు : చిన్న వెంగయ్య
ఖాతా నెంబరు : 903 సర్వే నెం. : 607
భూమి వివరణ : మెట్ట విస్తీర్ణం : 2.05
యాజమాన్య రకం : అనువంశికము
మ్యుటేషన్ ఆమోదించిన తేదీ :

వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన వీరయ్య వివరాలు

సంబేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదవాడి గృహనిర్మాణ పథకం (ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పక్కా గృహాల నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 44609 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసే సమయంలో లేని నిబంధనలను చూపుతూ సాకుల పేరుతో కోతలు పెట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 7652 మంది అనర్హుల జాబితాను విడుదల చేశారు. సంబేపల్లె మండలంలో 307 మంది అనర్హులుగా గుర్తించినట్లు తెలియజేశారు. అయితే ఈ జాబితాలో చాలా మంది అర్హులు ఉన్నట్లు చెబుతున్నారు. వారికి 10 ఎకరాల పొలం లేకపోయినా వారి పేరిట ఉందని, గృహ అవసరానికి వాడుతున్న కరెంటు తక్కువ వాడుతున్నా 300 యూనిట్లు వాడుతున్నారని, ఫోర్‌వీలర్ వాహనాలు లేకపోయినా ఉన్నట్లు ఇలా సాకులు చూపి అనర్హులుగా గుర్తించడంతో నిజమైన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

కరెంటు ఎక్కువ వాడినట్లు చూపించారు

- ఎం.ధనలక్ష్మి, పెద్దజంగపల్లి, దుద్యాల గ్రామం



ఈమె పేరు ధనలక్ష్మి. ఊరు దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లి. ఆమె ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో అన్ ఎలిజిబుల్ జాబితాలో ఆమె పేరు ఉంది. కారణం ఆమె 300 యూనిట్లు కరెంటు వాడుతున్నట్లు చూపారు. అయితే ఆమె ఇంటి సర్వీస్ నెంబర్ 2412663 000191కు సంబంధించి ఇప్పటి వరకు ఎప్పుడూ 300 యూనిట్లు దాటిన పరిస్థితి లేదని చెబుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశీలించి అర్హులుగా గుర్తించాలని కోరుతోంది.


అర్హులకు న్యాయం చేస్తాం

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య

ప్రధానమంత్రి ఆవాస యోజన జాబితాలో అన్ ఎలిజిబుల్ అభ్యర్థుల జాబితాను ఇటీవల విడుదల చేశాం. అందులో అనర్హుల పేర్లను ప్రకటించి తెలియజేశాం. అర్హులైన వారు సంబంధిత అధికారుల వద్ద ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే మంజూరు కోసం తిరిగి జాబితాను పంపుతాం. సమస్యపై విచారించి పై అధికారులతో మాట్లాడి అర్హులకు తప్పకుండా న్యాయం చేస్తాం.

పది ఎకరాలు ఉన్నట్లు చూపుతున్నారు

- వీరయ్య, పెద్దజంగంపల్లి, దుద్యాల



ఈయన పేరు మద్దిరాల వీరయ్య. ఖాతా నెంబర్ 903 వెబ్‌ల్యాండ్‌లో 3.68 ఎకరాల పొలం ఉంది. వారి కుటుంబ సభ్యులందరికీ కలిపి ఉన్న పొలం ఇదే. అయితే ఆయనపై 10 ఎకరాలపైన పొలం ఉన్నట్లు చూపిస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్నా పది ఎకరాలు ఉన్నట్లు జాబితాలో చూపించడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించినా 3.68 సెంట్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా నిజమైన అర్హులను గుర్తించి గృహ నిర్మాణం మంజూరు చేయాలని కోరారు.

నీళ్లు పారేదెలా...!

కేసీ నీటికి అడ్డంకిగా... జాతీయ రహదారి నిర్మాణ పనులు



జాతీయ రహదారి పనుల్లో భాగంగా విశ్వనాథపురం గ్రామం వద్ద కేసీ ఉపకాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి, సిమెంటు పైపులు వేసి తాత్కాలికంగా వేసిన రోడ్డు

చాపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ సాగునీటికి జాతీయ రహదారి నిర్మాణ పనులు అడ్డంకిగా మారాయి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా బెంగుళూరు-అమరావతి జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా మండలంలోని విశ్వనాథపురం గ్రామం వద్ద కేసీ కెనాల్‌కు ఉపకాలువ అయిన ఏటూరు కాలువపై బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. కాలువలో పెద్ద సిమెంటు పైపులు వేసి పైన తాత్కాలికంగా రోడ్డు వేశారు. ఈరోడ్డుపై ప్రతిరోజు కొన్ని వేల వాహనాలు తిరుగుతుంటాయి. ఈ పైపుల్లో ఒకవైపు పగిలిపోయింది. దీంతో కేసీ కాలువకు సాగునీరు వదిలితే కింద భూములకు పోయేందుకు అవకాశం లేదు. నీటి ప్రవాహానికి రోడ్డు కోసుకుపోయే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ కాలువ పరిధిలో సుమారు 8 వేల ఎకరాల భూములు ఉన్నాయి. విశ్వనాథపురం, అల్లాడుపల్లె, రాజకొట్టాలు, సన్నపల్లె, గాంధీనగర్ తదితర గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం జూలై నెల పంటలు సాగు చేసేందుకు మంచి అదును. అదే సమయంలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ప్రతి ఏడాది అధికారులు సాగునీటిని కేసీ కెనాల్‌కు వదులుతారు. ఈ కెనాల్ ద్వారా వచ్చే సాగు నీరు తమ పొలాలకు అందాలంటే నేషనల్ హైవే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

'జనాభా పెంచాలని సీఎం చెప్పడం విడ్డూరం'

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ మంది పిల్లల్ని కనండి, జనాభా పెరగాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం విడ్డూరమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. 1990 జూలై 11న ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దినంగా ప్రకటించిందన్నారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినం లక్ష్యమన్నారు. ప్రపంచ జనాభా 809 కోట్లు అయితే భారత్ జనాభా 144 కోట్లతో మొదటి స్థానంలో ఉందన్నారు. అటు జనాభా, ఇటు జన సాంద్రత విషయంలో భారత్ ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే కనీస అవసరాలు, ఉపాధి, ఉద్యోగాలు లభించక మద్యం, గంజాయి, డ్రగ్స్‌లకు బానిసలై అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారన్నారు. కావున జనాభా విషయంలో ముఖ్యమంత్రి తన అభి ప్రాయం మార్చుకోవాలని సూచించారు.

రేపు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమీక్ష సమావేశం

కడప క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కడప సీఎస్ఐ చర్చి వద్ద ఈ నెల 13న ఆదివారం ఉదయం 9.30 గంటలకు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాసరి రమణయ్య, కెప్టెన్ రాముడు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో ఇళ్ల స్థలాలు, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది సమస్యలు, సంక్షేమంపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి హాజరు కావాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

లింగాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరోపణలు రావడంతో పులివెందుల డీఎల్డీఓ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. శుక్రవారం లింగాల మండల పరిషత్ కార్యాలయంలో ఆమె రికార్డులను పరిశీలించారు. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.40లక్షలు ఏమయ్యాయో.. వాటిని ఏ అభివృద్ధి పనులకు ఉపయోగించారో అర్థం కావడం లేదు. కాగా గత నెలలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో మండలాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై జడ్పీ సీఈఓ ఓబుళమ్మ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల మండలానికి సంబంధించి నిధులను ఎందుకు ఖర్చు చేయలేదని అడగడంతో అధికారులు తమ ఖాతాలలో ఉన్న నిదులను ఖర్చు చేశామని చెప్పారు. అయితే జడ్పీ రికార్డులలో నిధులు ఖర్చు కాకుండా అలాగే ఉన్నట్లు చూపడంతో, రికార్డులకు అధికారులు చెప్పేలెక్కలకు పొంతన లేకపోవడంతో జడ్పీ సీఈఓ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు పులివెందుల డీఎల్‌డీఓ నిధుల వినియోగంపై విచారణ చేపట్టారు. అప్పటి ఎంపీడీఓలు సురేంద్రనాథ్, తేజోష్ణ, ఏఓ లోకేష్ విచారణకు హాజరయ్యారు. ఆ మేరకు డీఎల్డీఓ అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి కేసులో హైకోర్టు ఉత్తర్వులు

- 41 నోటీసు ఇచ్చి విచారణ చేయాలని సూచన
- 11 మందిని కోర్టుకు పంపగా వెనక్కి పంపిన జడ్జి

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో బాలిక అదృశ్యంపై జరిగిన నాటకీయ పరిణామాలలో బాలిక తరపు బంధువులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన వారు హైకోర్టును ఆశ్రయించారు. బాలిక అదృశ్యం కావడంతో పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లామని అక్కడ తోపులాటలో పోలీస్‌స్టేషన్ అద్దాలు పగిలిపోతే హత్యాయత్నం కేసు నమోదు చేశారని హైకోర్టులో పిటీషన్ వేయగా.. 41 నోటీసు ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని శుక్రవారం హైకోర్టు జడ్జి ఆదేశించారు. కాగా, వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన కేసుకు సంబంధించి 12 మందితో పాటు మరో 150 మందిపై కేసు నమోదైంది. ఇందులో నిందితులుగా ఉన్న హుస్సేన్ మరో 12 మందిని అరెస్టు చేసి శుక్రవారం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచారు. ఈలోగా హైకోర్టు 41 నోటీసుతో విచారించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో నిందితులను విచారించి తదుపరి చర్యలు తీసుకోవాలంటూ జమ్మలమడుగు జడ్జి ఆదేశించినట్లు సీఐ నరసింహులు తెలిపారు. దీంతో జమ్మలమడుగు కోర్టులో హాజరుపరిచిన 11 మందిని వెనక్కి పిలిపించి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. విచారణలో వారు చెప్పిన వివరాలను కోర్టుకు సమర్పించిన తర్వాత కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. కాగా ఈ కేసులో ఇప్పటికే చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. హైకోర్టు ఉత్తర్వులతో వారందరికి ఊరట లభించింది. నోటీసు ఇచ్చి విచారించిన తర్వాతే పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

పులివెందుల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో గాయపడిన శివశంకర్‌రెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని బాకరాపురానికి చెందిన శివశంకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డిల మధ్య ఇంటి వద్ద ప్రహరీగోడ విషయమై వివాదం ఉండేది. ఈ నేపథ్యం లో జూన్ 30వ తేదీన ఘర్షణకు పాల్పడ్డారు. శివశంకర్‌రెడ్డిపై పవన్ కుమార్‌రెడ్డి అతని కుమారుడు సందీప్ రెడ్డిలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అతన్ని కుటుంబ సభ్యులు కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున శివశంకర్‌రెడ్డి మృతి చెందారు. ఈ మేరకు పవన్‌కుమార్‌రెడ్డి, సందీప్‌రెడ్డిలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, విచా రణ సాగిస్తున్నామని ఏఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

మైదుకూరురూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామ సమీపంలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరికి శుక్రవారం మైదుకూరులో అంత్యక్రియలు నిర్వహించారు. మృతులు మైదుకూరు పట్టణం మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ కమాల్‌బాషా(50) పటాన్ మున్ని(40), మాబుచాన్, నాసియా (3 నెలలు)కు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం మృతదేహా లను మైదుకూరుకు తీసుకువచ్చి బంధువులు, స్థానికులు కలిసి అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కాగా హైదరాబాద్‌కు విహారయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో వీరు మృతి చెందిన విషయం తెలిసిందే.

ఆటో తగిలి చిన్నారి మృతి

ఖాజీపేట జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూలవారిపల్లెలో పాల ఆటో తగిలి అంజలి (3) అనే చిన్నారి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. మూలవారిపల్లెకు చెందిన రామ్మోహన్ కుమార్తె అంజలి రోడ్డుపై ఉండగా పాల ఆటో తగలడంతో టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాటర్ ట్యాంక్‌పడి దెబ్బతిన్న నివాస గృహం





కూలగొట్టే క్రమంలో.. ఇంటిపై పడిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కాశినాయన, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావిశెట్టిపల్లెలో శుక్రవారం శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను కూలదోస్తుండగా సమీపంలోని నివాస గృహంపై పడింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామం నడిబొడ్డున ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామస్థులు ట్యాంక్‌ను వినియోగించక ఇది శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం దీనిని కాంట్రాక్టర్ కూలగొట్టే క్రమంలో వెంకటసుబ్బయ్య ఇంటిపై పడింది. దీంతో ఆ ఇల్లు కొంత భాగం దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబయ్యను వివరణ కోరగా కూలగొట్టమని తాము ఎవరికీ చెప్పలేదన్నారు. దీనిపై విచారించి పైఅధికారుల దృష్టికి తీసుకపోయి చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసుల విచారణకు వచ్చి...

బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాల కేసులో విచారణకు హాజరయ్యేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నకిలీ ఇంటిపట్టాల కేసులో పలువురిని పోలీసులు విచారిస్తున్నారు. ఈక్రమంలో బయనపల్లెకు చెందిన పిల్లి భాస్కర్‌ను విచారణ నిమిత్తం గత వారం రోజులుగా ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాత్రి ఇంటికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం విచారణ నిమిత్తం స్టేషన్‌వద్దకు వచ్చిన పిల్లి భాస్కర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించి.. మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను
సోషల్ ఆడిట్ కోసం ఉంచాలి

- జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్

కమలాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను తప్పనిసరిగా సోషల్ ఆడిట్ కోసం ఉంచాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం కమలాపురం డివిజన్ పరిధిలో రైతు సేవ కేంద్ర సిబ్బందికి ఏడీఏ నరసింహారెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతుసేవ కేంద్ర సిబ్బంది వ్యవసాయశాఖలోని పథకాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా తప్పనిసరిగా సోషల్ ఆడిట్ కోసం ఉంచాలని, జాబితాలో పేరు లేని రైతులు రైతుసేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి గ్రీవెన్స్ ఇవ్వాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాలలో నిర్వహించాలని, ఆయా గ్రామ రైతులందరికీ ఆర్ఎస్‌కే సిబ్బంది తెలపాలన్నారు. పంట పొలాలను సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, రైతుసేవ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన పీజీ సెమిస్టర్ పరీక్షలు

తొలి రోజు 96శాతం మంది హాజరు



పీజీ పరీక్షలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, సీఈ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పీజీ కళాశాల, అనుబంధ పీజీ కలాశాలల రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 96శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 674 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6503 మంది (96శాతం) హాజరయ్యారు. 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈపరీక్షలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, వసతులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప ఎస్వీ పీజీ కళాశాల, ప్రొద్దుటూరు ఎస్సీఎస్‌ఆర్ పీజీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను పంపామని, ప్రత్యేకంగా హైపవర్ కమిటీ పరీక్షలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

భూకబ్జాల విషయంలో ఎవరినీ ఉపేక్షించవద్దు

- బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి



బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్ర జ్యోతి) : ఇటీ వల భూకబ్జాలు, నకిలీ పట్టాల విషయంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్న నేపథ్యంలో కొన్ని ప్రచార మాధ్యమాల్లో టీడీపీ వ్యక్తుల ప్రమేయం ఉందని వస్తున్న ఆరోపణలపై నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి స్పందించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూకబ్జాలు, నకిలీ పట్టాల విషయంలో ఎంతటి వారినైనా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీ సుశాఖ అధికారులను కోరారు. బద్వేలులో గత వైసీపీ ప్రభుత్వంలోనే అనేక మంది భూకబ్జాలకు పాల్పడ్డారని స్వయంగా తానే ప్రజలకు తెలియజేశానన్నారు. అలాంటి వారిని ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కబ్జాదారులను విచారిస్తూ చర్యలను తీసుకుంటున్నారన్నారు. చట్టానికి అందరూ సమానమేనని, పార్టీలకు అతీతంగా ఏ పార్టీకి చెందిన వారినైనా కఠిన చర్యలు తీసు కోవాల్సిందిగా ఆయన కోరారు.

ఆడిట్ బృందం తనిఖీలో లోపాలు

- ప్రతి పనిలో వేలెత్తి చూపడమే.. ● బతికి ఉన్నమొక్కలను చచ్చిపోయినట్లుగా చూపిన వైనం



డ్వామా పీడీ ఆదిశేషారెడ్డిని చుట్టుముట్టిన ఆడిట్ బృందం, ఉపాధి సిబ్బంది

పులివెందుల రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిన ఆడిట్ బృందం తనీఖీల్లో లోపాలు ఉన్నట్లు బట్టబయలైంది. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆడిట్ బృందం 2024-25 సంవత్సరంలో జరిగిన పనులు, ఖర్చుచేసిన వివరాలు తనిఖీ చేసి నివేదికలు తయారు చేసింది. ఎస్టిమేషన్ ప్రకారం పనులు జరిగాయా, ఉపాధి ద్వారా ఎక్కడెక్కడ ఏఏ పనులు చేశారు, ప్రజలకు ఉపయోగపడుతున్నాయా, నిధులు ఎంత వెచ్చించారు, ఖర్చు చేసినంత మేర పనులు జరిగాయా అనే తదితర వివరాలు నివేదికలు తయారు చేశారు. అయితే కొన్ని చోట్ల డకౌట్ పాండ్ జరిగిన పనుల్లో లోతు, పొడవు, వెడల్పు నిబంధనల ప్రకారం కాకుండా తక్కువగా జరిగాయని తాము పరిశీలించామని తనిఖీ బృందం వివరించింది. దీంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు సమాధానమిస్తూ ప్రతి పని పక్కాగా చేశామని, ఫొటోలు చూపించారు. మరికొన్ని చోట్ల డకౌట్ పాండ్స్ లోతు తక్కువగా తీశారని తనిఖీ బృందం తెలియజేయగా అక్కడ పెద్దరాయి ఉందని అందుకే అలా తక్కువగా తీయించామని, దీన్ని అంతా ఎంబుక్‌లో నమోదు చేశామని పీడీకి వివరించారు. అలాగే కనంపల్లెలో ఉపాధి కింద చీనీ మొక్కలు నాటుకున్నామని, అయితే తనిఖీ బృందం వారు 9 మొక్కలు చనిపోయినట్లు నివేదిక ఇచ్చారని ఓ రైతు తెలిపారు. ప్రతి పనిలోను ఏదొక వంకలు పెడుతున్నారని పలువురు చర్చించుకున్నారు. కాగా సామాజిక తనిఖీలో ఉపాధి సిబ్బంది లోపాలు బయటపడేవని, అయితే ఈసారి సామాజిక తనిఖీ బృందం తనిఖీల్లో లోపాలు బయటపడ్డాయని పలువురు అధికారులు, రైతులు చర్చించుకోవడం గమనార్హం.

ఎల్లటూరు సింగిల్ విండో అధ్యక్షుడిగా సురేంద్రారెడ్డి

పెండ్లిమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి):ఎల్లటూరు సింగిల్ విండో అధ్యక్షుడిగా గొల్లయ్యగారిసురేంద్రారెడ్డి, మెంబర్లుగా పాలేటి,పుష్పరాజు నియమితు లైనట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డిని టీడీపీ నేతలతో మర్యాద పూర్వకంగా కలసి పూలమాల, శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి,పెద్ద నరసారెడ్డి,చంద్ర ఓబుల్‌రెడ్డి, వీర మైసూరారెడ్డి,మహేంద్ర,సుబ్బిరెడ్డి, శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

కడప క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) :ఏపీ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి,మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ టీం ఐ.జి ఆకే రవి కృష్ణ , ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి రైల్వే స్టేషన్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మహిళా పిఎస్ డీఎస్పీ బాల స్వామి రెడ్డి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తో రైలు బోగీలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో వన్ టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి, రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణకోసం పోరుబాట

కడప ఎర్రముక్కపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణ కోసం పోరుబాట చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన అభివృద్ధి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకటశ్రావణ్‌కుమార్, వర్గీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఎస్టీ వర్గీకరణ సాధన సమితి జిల్లా కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఈశ్వర్, నాగేంద్ర, నరేంద్ర, సిద్దు, వీరేష్,దామోదర్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎన్నిసార్లు చెప్పినా అంతే..!

- కేసీలోకి మురుగునీరు, కోళ్లు, చేపల వ్యర్థాలు
- చెన్నూరులో బుగ్గవంకను తలపిస్తున్న కాల్వ
- కేసీకాల్వలోకి బాత్‌రూములు, టాయిలెట్ల నీరు
- మారని ప్రజల తీరు
- ఆవేదనలో కింది ప్రాంత ఆయకట్టు రైతులు



చెన్నూరు కొత్తరోడ్డు వద్ద బుగ్గవంకను తలపిస్తున్న మండలంలోని ప్రధాన కేసీ కాల్వ

చెన్నూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండల రైతులకు జీవనాధారమైన కేసీ కెనాల్ బుగ్గవంకను మరిపిస్తోంది, ఈ కాల్వ కింద ఆయకట్టు రైతులు పై ప్రాంతం నుంచి ఈ కాల్వలో ప్రవహించే మురుగునీటితో పంటల కాలంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్వపు రోజుల్లో ఇదే కాల్వ నీటినితాగేందుకు



లక్ష్మీనగర్ వద్ద ఇళ్ల నుంచి వచ్చిన నీటితో మురుగుకాల్వగా మారిన కేసీ కాలువ

వాడిన ప్రజలు, రైతులు నేడు ఆ కాల్వ పరిస్థితి చూసి ఛీ ఇదేంటి, కేసీ కాల్వ బుగ్గవంక కాల్వ అని చెప్పుకోవడం జరుగుతోంది. దీనికంతటికీ ప్రధాన కారణం చెన్నూరు కొత్తరోడ్డు ప్రాంతంలో కాల్వలోకి ఏర్పాటు చేసిన మురుగునీటి పైపులైను. కాల్వకు ఇరువైపులా నివాసం ఉన్న ప్రజలు తమ ఇళ్లల్లో మురుగునీటిని అదే ఇంటి ముందు గుంతలు కొట్టి పారించుకోవాల్సిన పరిస్థితి తప్పించి పైపులు ఏర్పాటు చేసి కేసీ కాల్వలోకి పెట్టడం జరిగింది. దీంతో రోజూ మురుగునీరంతా ఆ పైపుల గుండా కేసీ కాల్వలోకి చేరాల్సిందే. కేవలం వర్షం నీరు వరకు వెళితే ఇబ్బంది ఉండదు. ఇళ్లల్లో అన్ని రకాల వాడిన నీరంతాపంట కాల్వ అయిన కేసీ కాల్వలోకి వదులుతున్నారు. ఫలితంగా వేసవికాలం సైతం ఈ కేసీ కాల్వ మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతూ ముక్కు పుటాలు బద్దలయ్యేలా కంపుకొడుతుంది. కనీసం కాల్వ వైపు చూడాలన్నా అసహ్యంగా కనిపిస్తుంది. పైగా ఇళ్లల్లోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఒకటేమిటి ఏవి నిరుపయోగంగా కనిపించినా వాటన్నింటికీ కాల్వలోనే వేస్తున్నారు. గ్రామ పంచాయతీవారు రోజూ వీధుల్లో తిరిగి ఇళ్లల్లోని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకండి, ఇంటికి వచ్చే చెత్తబండికి ఇవ్వండి అని చెబుతున్నా వారి మాటలు పెడచెవిన పెట్టి ఇళ్లల్లోని వ్యర్థాలన్నీ కేసీ కాల్వ పనికిరాని కాల్వగా చూసుకుంటూ అందులో పడేస్తున్నారు. దీంతో చెన్నూరు కొత్తరోడ్డు నుంచి ఊరిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు కాల్వ బుగ్గవంకను మరిపిస్తోంది. అంతేగాక కేసీ ఉపకాల్వలో కొత్త రోడ్డు లో వ్యాపారం చేసేవారు కోళ్ల, చేపల వ్యర్థాలు వేయడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

పట్టించుకోని అధికారులు..: కేసీ కాల్వలో వ్యర్థాలు వేయకూడదని, మురుగునీరు పారించవద్దని ఆ కాల్వ కింది ప్రాంత ఆయకట్టు రైతులు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు తూతూ మంత్రం చర్యలు తప్ప గట్టిగా చర్యలు తీసుకునే దాఖలాలు లేవని అంటున్నారు. అటు పంచాయతీ, ఇటు కేసీ కెనాల్, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు ఈ నాలుగు శాఖల అధికారులు ఒక్కమారుగా గట్టి చర్యలు తీసుకుంటేనే కానీ ఫలితం లేదని రైతులంటున్నారు. కాల్వకు ఇరువైపులా ఉన్న వారి నిర్వాకంతో మిగతా కాల్వలకు కూడా దుర్వాసన వస్తూ దోమలకు నిలయంగా మారి రోగాలబారిన పడుతున్నారని ఇందుకు కారకులైనవారిపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో మురు గునీటికాల్వగామారుతుందనడంలో సందేహం లేదు.

నేడు విద్యుత్ అంతరాయం

కడప నాగరాజుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి):కడప నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని కడప టౌన్-2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని ముత్రాసుపల్లె, రెడ్డి కాలని, పకీరుపల్లె, ఓంశాంతినగర్, అబ్దుల్‌కలాంకాలనీ, చిన్నచౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్‌కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లె రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, ద్వారకనగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె, సీపీబ్రౌన్, మున్సిపల్ ఆఫీస్, ఆర్టీసీ బస్టాండ్, పటేల్ రోడ్డు, అరవింద్‌నగర్, తేజపెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుం దని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సింహాద్రిపురం..: 33కేవీ జంగంరెడ్డిపల్లి ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనున్నట్లు ఏఈ దినేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కోవరంగుట్టపల్లి, అంకాళమ్మగూడూరు, జంగంరెడ్డిపల్లి, రావులకొలను సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుంది. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

లింగాల..: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో మెయింటెనెన్స్ వర్క్ జరుగుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నూరు..: మండలంలో రెండో శనివారం సందర్భంగా ఉదయం8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్, లైన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సమరశీల పోరాటాలే లక్ష్యం

కమలాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలేలక్ష్యంగా జూలై 22 నుంచి 24 వరకు బద్వేల్‌లో జిల్లా మహాసభలు, ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరగబోతున్నాయని శుక్రవారం స్థానిక షాదీఖానాలో జరిగిన సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏరియా మహాసభలలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్రపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, వెంకటశివ, చంద్రశేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కడప కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'పేరెంట్స్ మీట్‌లో చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే'

కడప ఎర్రముక్కపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేరెంట్స్‌మీట్‌లో ఒక ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలు అని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష మండిపడ్డారు. తల్లికివందనం పథకం లోకేశ్ ఆలోచనల నుంచి పుట్టింది అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. శుక్రవారం కడపనగరం తనకార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్మఒడి పథకం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014 ఎన్నికల్లోనే ప్రచారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, దాసరి శివప్రసాద్, జయచంద్రారెడ్డి, షఫి, ఇలియాస్, అలీ అక్బర్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదలచేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. జీఓ 77నురద్దుచేయాలని కోరారు. శుక్రవారం మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చికలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అకిరానంద్ తేజ,పీటర్, అశోక్, శమంత్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెలుగు భాష పరిరక్షణ సదస్సును విజయవంతం చేయండి

కడప కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మాతృభాష పట్ల మమకారం కలిగి వుండాలని ఆకాంక్షిస్తూ తెలుగుభాషను పరిరక్షించుకోవాలనే ధ్యేయంతో కర్నూలు టీజీవి కళాక్షేత్రంలో ఈనెల 12, 13, తేదీలలో తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సును విజయవంతం చేసేందుకు భాషాభిమానులంతా తరలిరావాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో పై సదస్సుకు సంబంధించిన బ్రోచర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, గ్రంథాలయ తాళపత్ర పరిశోధకుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకుడు హరి భూషణరావు, వెంకటరమణ, చిట్టి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపాఠశాలల్లో నాణ్యమైన విద్య

కడప మారుతీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వపాఠశాలల్లో నాణ్యమైన ఉత్తమ విద్య అందుతోందని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ కితాబిచ్చారు. శుక్రవారం స్థానిక నగర జామున్ బౌలిలోని నగర పాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా సలావుద్దీన్ హాజరై మాట్లాడారు. అనంతరం మాతృమూర్తి ప్రాముఖ్యతపై డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ, పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రహమాన్ సొసైటీ అధ్యక్షుడు ఖుతుబుద్దీన్, బాలాజీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మహబూబ్‌పీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎలిజీవత్ రాజమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటలో లోపాలను సవరించుకోవాలి

వీరపునాయునిపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటలో సూక్ష్మదాతు లోపాలను సవరించుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం ఎన్.పాలగిరి గ్రామంలో ఏవో శ్యామ్‌బాబుతో కలిసి పత్తి పంట పొలాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. అలాగే పంటల సాగులో చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానపంటలపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై రైతులు అవగాహన పెంచుకుని సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి శివరామకృష్ణ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లెలో శుక్రవారం పసుపు, అరటి పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ గిరిధర్, శాస్త్రవేత్తలు అరుణోదయం,శాస్త్రవేత్త బాలకృష్ణ, సందీప్‌నాయక్, రేష్మా, ఉద్యాన అధికారి జీవన్, ఏవో ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు చేపట్టాలి

పెండ్లిమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి):రైతులు సాగుచేసిన పంటల వివరాల నమోదు త్వరలో ప్రారంభమవుతుందని రైతు సేవాకేంద్రాల సిబ్బంది వివరాలతో సిద్ధంగా ఉండాలని ఏవో క్రిష్ణసుమంత్‌రెడ్డి తెలిపారు.మండల కేంద్రంలో శక్రవారం సిబ్బందికి ఏఓ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటల బీమా గురించి రైతులకు వివరించాలన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద అరటి,వేరుశనగ, పత్తి, చీనీ పంటలకు ఈనెల 15 చివరి తేది అన్నారు.డ్రోన్స్ 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామన్నారు.ఆసక్తి గల రైతులు సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి రెడ్డయ్య పాల్గొన్నారు.

రిమ్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిపెట్టండి

కడప సెవెన్ రోడ్స్‌జూలై 11 (ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్‌చేశారు. శుక్రవారం సీపీఎం కడపనగర కమిటీ ఆధ్వర్యంలో రిమ్స్‌లో పర్యటన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరిరెడ్డి, నరసింహ, జార్జి తిమ్మయ్య పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో శక్తి టీమ్ నిఘా

కడప క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆటకట్టించేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘాపెడుతున్నారు. శుక్రవారం ఉదయం శక్తి టీముల ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల వద్ద బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామని మహిళ పోలీసు స్టేషన్ ఎస్ఐ శాంతమ్మ అన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలను వేధించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ శ్రీనివాసులు, ఏహెచ్‌టీయూ ఎస్.ఐ శాంతమ్మ, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉదయపూర్ ఫైల్స్ సినిమాను నిషేధించాలి'

జేసీకి వినతిపత్రం అందజేత

కడప కలెక్టరేట్, జూలై11 (ఆంధ్రజ్యోతి):మత విద్వేషంతో నిర్మించిన ఉదయపూర్‌ఫైల్స్ అనే హిందీ సినిమా ప్రదర్శనను వైఎస్సార్ కడప జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిషేధించాలని ఏపీ పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మయాన రహమతుల్లాఖాన్ శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.దర్శక, నిర్మాతలు నటీనటులపై క్రిమినల్ కేసులు పెట్టాలనీ, ప్రభుత్వం ఇలాంటి సినిమాలను నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వల్లూరు ఎస్ఐకి ప్రశంసా పత్రం

వల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండలం ఎస్ఐ పెద్ద ఓబన్న శుక్రవారం ఎస్పీ అశోక్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రం, నగదు రివార్డును అందుకున్నారు. ఎస్ఐ గా పెద్ద ఓబన్న వల్లూరులో విధులు నిర్వహిస్తూ పలు దొంగతనాల్లో కేసులను క్షుణ్ణంగా పరిశీలించి దొంగలను పట్టుకుని కేసులను పూర్తి చేసినందుకు గాను ఆయనకు ప్రశంసాపత్రం వచ్చిందని అన్నారు ఆయనతో పాటుగా సీఐ రోషన్‌కు కూడా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇదిలా వుండగా దొంగతనాల కేసుల్లో ఎస్ఐతో పాటుగా సహకరించిన నాగరాజు అనే కానిస్టేబుల్ కూడా ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఘనంగా ఈయూ 74వ ఆవిర్భావ దినోత్సవం

కడప మారుతీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక జోనల్ వర్క్‌షాపులో ఘనంగా నిర్వహించారు. ఆర్.వి.ఎస్.రెడ్డి చేతుల మీదుగా యూనియన్ జెండాను ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, రీజనల్ సెక్రటరీ అంకిరెడ్డి, రవినాయక్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.కాగా ఆర్టీసీ డిపో,జోనల్ కార్యాలయంలోనూ ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎ.ఆర్.మూర్తి హాజరై కేక్ కట్‌చేసి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, గ్యారేజీ నాయకులు పాల్గొన్నారు.

చిన్న వయస్సులో వివాహాలు అనర్థం

పెండ్లిమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి):చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం వలనఅనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని నందిమండలం పీహెచ్‌సీ వైద్యుడు చెన్నారెడ్డి తెలిపారు.ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రామప్రతాప్, మార్గరేట్, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం షరతులు లేకుండా ఇవ్వాలి

కడప కలెక్టరేట్,జూలై11(ఆంధ్రజ్యోతి):తల్లికి వందనం పథకం విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు శుక్రవారం ప్రకటన లో డిమాండ్ చేశారు. మునుముందు తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందజేయాలని శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

అవగాహన కోసమే ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

వేంపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి):పెరుగుతున్న జనాభా వల్ల ఏర్పడుతున్నసమస్యలపై ప్రజలలో అవగాహన కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవం ప్రధాన లక్ష్యమని డాక్టర్ పృథ్వీకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుభాషిణి, శాంతి,నిహారిక, అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

లింగాల,జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంట సాగుచేసేందుకు రైతులు ముందుకురావాలని పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. లింగాల మండలం వెలిదండ్ల రైతుసేవా కేంద్రంలో ఆయిల్ పామ్ సగుపై శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయిల్ పామ్ సాగుచేసేందుకు ప్రభుత్వంరాయితీలు అందిస్తోందన్నారు. ఎంపీపీ రమాదేవి ఎంకే కంపెనీ ప్రతినిధి మురళి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




కమలాపురంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, సింహాద్రిపురంలో టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న దృశ్యం

కమలాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో అంతా సంతోషాలే వినిపిస్తున్నాయని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో సుపరిపాలనతొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు పాలనలో సూపర్‌సిక్స్ పథకాల అమలుగురించి అడిగి తెలుసుకున్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదే విధంగా అర్హత ఉండి పథకాలు రాని కుటుంబాలకు అక్కడే అధికారులను పిలిచి పరిష్కారం చూపిస్తున్నామన్నారు. స్థానికంగా పరిష్కారం కానివి ఎలా చేస్తే పరిష్కారం అవుతాయి అనే విధంగా అధికారులు ఆదేశించామన్నారు.

సింహాద్రిపురం..: రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుకే సాధ్యమని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి తెలిపారు. శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బీటెక్ రవి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ఇస్లాంపూర్ వీధిలో ప్రచారం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో సింహాద్రిపురం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేంపల్లె..: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకోవానలి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పందిళ్లపల్లె రామగంగిరెడ్డి సూచించారు. మండలంలోని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాదిపాలన గురించి ప్రజలకు శుక్రవారం వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే శివకృష్ణారెడ్డి,కంతురివెంకటేశ్ తదితరులు సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. వేంపల్లె పట్టణంలో మండల కన్వీనర్ మునిరెడ్డి, యువ నాయకులు నామా వేమకుమార్ సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు.

రైతుల సంక్షేమానికి ప్రత్యేక కృషి



డాక్టర్ ఎస్‌వీ హరికుమార్ వ్యవసాయాధికారి, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ సాంబ వరాహరి కుమార్ పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగులమందు రైతులు అధీకృత డీలర్లవద్దనే కొనుగోలు చేయాలని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పశ్న: ప్రొద్దుటూరు మండలంలో ఖరీఫ్ సాగు ఎలా ఉంది. ?

జవాబు: మండల పరిధిలో సుమారు 3,500 ఎకరాల సాగు విస్తీర్ణం లక్ష్యం. కాగా వరి, పత్తి, కంది, వేరుశనగ పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పశ్న: ఎరువులను అధిక ధరలకు విక్రయించకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

జవాబు: ఎఫ్‌సీవో యాక్టు, ఐఏ, సీడ్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం ఎరువులు, విత్తనాలు తదితరవి ఎమ్మార్పీ కే కచ్చితంగా అమ్మాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వస్తే దుకాణాల లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తాం.

ఫేస్ టు ఫేస్

ప్రశ్న: మట్టి నమూనాలు ఎన్ని సేకరించారు. వాటి ఫలితాలెప్పుడు ?

జవాబు: మండలంలో వివిధ ప్రాంతాల నుంచి 990 మట్టి నమూనాలను సేకరించి సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించాం. పరీక్షల అనంతరం ఒక నెల లోపు ఫలితాలను రైతులకు ఇస్తాం.

ప్రశ్న: అన్నదాత సుఖీభవ ప్రక్రియలో అర్హులు ఎంత మంది ?

జవాబు: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 90 శాతం పైగా రైతుల ఈకేవైసీ పూర్తయ్యాయి. మండలానికి ఇప్పటి వరకు 4,939 మంది అర్హుల జాబితా సిద్ధమైంది. స్వల్ప సంఖ్యలో ఇంకా ఈకేవైసీలు జరగాల్సి ఉంది. త్వరలో తుది జాబితా విడుదల అవుతుంది.

గుంటూరు వెళ్లే రైలు స్టాపింగ్ పర్మినెంట్ చేయాలి

జమ్మలమడుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో తిరుపతి నుంచి గుంటూరుకు వెళ్లే రైలు స్టాపింగ్ పర్మినెంట్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ కోరారు. శుక్రవారం జమ్మలమడుగులో డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు సుబహాన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తిరుపతి నుంచి గుంటూరుకు వెళ్లే రైలు జమ్మలమడుగులో స్టాఫింగ్ కొద్దిరోజులుమాత్రమే ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం రైలు స్టాఫింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసమే మహాసభలు

బద్వేలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసమే ఈ నెల 25న జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన హామీలైన ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, అన్నదాతలను ఆదుకోవాలని తదితర అంశాలపై సీపీఐ దశల వారీ ఉద్యమాలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, మునిరత్నం, వెంకటరమణ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై ఆసక్తి

దువ్వూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా నైరుతి కరుణించకపోవడంతో రైతన్నలు ఆరుతడి పంటలపైన ఆసక్తి చూపుతున్నారు. దువ్వూరు మండలంలో రైతులు మినుము, మొక్కజొన్న పంటలను విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఈ పంటలు వేయడానికి పెట్టుబడులు తక్కువ కావడంతో సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌గా పంట పెట్టడానికి ముందే విత్తనాలు సేకరించుకున్న రైతులు సేద్యాలు చేసి విత్తనం వేశారు. ఆరుతడులుగా అప్పుడప్పుడు నీటిని అందిస్తే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మినుము చాలా మంది వేయగా మొక్కజొన్నను కూడా సాగు చేశారు. ఇప్పటి వరకు ఖరీఫ్ పంటగా మినుము 250 ఎకరాలు, మొక్కజొన్న, జొన్న కలిపి 270 ఎకరాల్లో సాగైనట్లు మండల వ్యవసాయ శాఖ రికార్డులో నమోదైంది. మినుము పంట గత సంవత్సరం 700 ఎకరాలుగా సాగు చేశారు. అప్పట్లో సరైన దిగుబడులు అందక రైతులు కొందరికి అతి కష్టంగా పెట్టుబడులు దక్కాయి. మరికొందరు రైతులు మాత్రం లాభాలు గడించారు. క్వింటాలు మినుము ధర రూ.8,500 . పలికింది. బాగా పండితే ఆదాయం బాగుంటుందని రైతులు అంటున్నారు. క్రాసింగ్ జొన్న వేసిన రైతుల వద్ద నుంచి విత్తన కంపెనీలు క్వింటా రూ.6 వేలు దాకా చెల్లించి కొనుగోలు చేసింది. మొక్కజొన్నను ప్రత్యేంగా కొనుగోలు చేయడం జరిగింది. జొన్నలను రూ.2,500 ధర చెల్లించి కొనుగోలు చేశారు. సాగు ఖర్చులు తక్కువ, నీరుతడులు కూడా పంటకు తగిన మేర అందిస్తే ప్రయోజనం ఉంటుందన్న నేపథ్యంలో మినుము, మొక్కజొన్న పంటలు మంచి ఫలితాలు ఉంటాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు.



మురళీనగర్ వద్ద వేసిన మినుము పంట

సీఐని అభినందించిన ఎస్పీ



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ మోహన్

ఖాజీపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట సీఐ మోహన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రశంసా పత్రం అందించి అభినందించారు. దొంగతనాల కేసుల్లో నగదు, బంగారంను రికవరీ చేయడంలో ప్రత్యేక కృషి చేసి యజమానులకు అందించడం జరిగిందని, ఆమేరకు సీఐని, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పొగాకు పరిశీలన



పొగాకు రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమౌళి

బి.కోడూరు జూలై11 (అంధ్ర జ్యోతి) బి.కోడూరు పర్యటనకు వచ్చిన బద్వేల్ ఆర్డీవో చంద్ర మౌళి శుక్రవారం మునెల్లి గ్రామంలోని పొగాకు రైతులతో మాట్లాడి పొగాకును పరిశీ లించారు. ఆయన వెంట పోరుమామిళ్ళ ఏడీ మురళీధర్‌రెడ్డి
ఏవో కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం చలో ఢిల్లీ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన హామీల కోసం ఈనెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శుక్రవారం చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప ఉక్కు, వెనుకబడిన ప్రాంతాలకు బుందేఖండ్ తరహా ప్యాకేజీ వంటి హామీలు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా ఇప్పటికి ఏ ఒక్క హామీ అమలు కాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వనాథ్, సుబ్బు, రమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో: కేంద్రప్రభుత్వం విభజన చట్టంలోని హామీలు, అందులో ముఖ్యమైనది ఉక్కు పరిశ్రమ హామీలను కేంద్రం పూర్తిగా విస్మరించిందని, వాటి సాధనకైఈ నెల18 డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు చిన్ని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమకు వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేయడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉక్కుపరిశ్రమ ఏర్పాటుతో రాయలసీమ ప్రాంత ప్రజలువలసలు వెళ్లడం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య

బద్వేలుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బద్వేలు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సుమిత్రానగర్‌కు చెందిన జగన్నాథం రవి సుమారు 20 సంవత్సరాల క్రితం కడప నగరం తిలక్‌నగర్ ఎస్టీకాలనీకి చెందిన రామలక్షుమ్మ(40)ను వివాహం చేసుకున్నాడు. కొన్ని సంవత్సరాల తరువాత రామలక్షుమ్మ సమీపం బంధువును రెండవ వివాహం చేసుకున్నాడు. ఆ వ్యక్తికి రెండు పెళ్లిలై ఆరుగురు సంతానం కూడా ఉన్నారు. ఈ క్రమంలో 3వ వివాహానికి సిద్ధమయ్యాడు. ఈ విషయంపై మృతురాలు రామలక్షుమ్మ జగన్నాథం రవిల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. బుధవారం రాత్రి భార్యా భర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో తన బంధువుల అమ్మాయిని మూడవ వివాహం చేసుకుంటానని తెల్పి చెప్పడంతో మృతురాలు రామలక్షుమ్మ తీవ్ర మనస్తాపానికి గురై ఇంటిలోని గదిలోకి వెళ్లి గడియ పెట్టుకొని కత్తితో కడుపులో ఎడమ చేతిపైన పొడుచుకుంది. స్థానికులు గమనించి రామలక్షుమ్మను హుటా హుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా, శుక్రవారం మృతి చెందింది. తమ అక్క మృతికి కారణమైన రవిపై చర్యలు తీసుకోవాలని మృతురాలు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యకరమైన పద్ధతులను అలవర్చుకోవాలి



పెద్దశెట్టిపల్లె గ్రామంలో ర్యాలీ నిర్వహించిన వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరుటౌన్/ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన దినచర్యలు పాటించాలని వైద్యాధికారులు హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని కామనూరు, పెద్దశెట్టిపల్లె, గోపవరం, సోములవారిపల్లె, సచివాలయాల పరిధిలో అవగాహన, ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కాన్పుకు కాన్పుకు మధ్య గ్యాప్ ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టీఏ వరప్రసాద్, సీహెచ్‌వో కృష్ణమ్మ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. శనివారం ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో ముగ్గురు పిల్లలు ఉంటే వారికి మెరుగైన విద్యను అందించి అన్ని సౌకర్యాలు కల్పించవచ్చన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ అనూష మాట్లాడుతూ ఇద్దరు లేక ముగ్గురు పిల్లల తర్వాత పిల్లలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో షిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా, డాక్టర్లు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎదుట డాక్టర్లు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కలసపాడులో: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలసపాడులో ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ లు జనాభా పెరుగుదల వలన కలి గే ఆర్థిక, వనరు ల కష్టనష్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు, యుక్తవ యసులో పెళ్లిల్లు తదితర విషయాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

దువ్వూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వైద్యులు సురేష్‌బాబు, రోష్ని అన్నారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం, డ్రైడే, ఫ్రైడేను సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో రాజగోపాల్, సువర్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలన తొలి అడుగు ప్రచారం



టీడీపీ పథకాల గురించి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

దువ్వూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టౌన్ ఇన్‌చార్జి పాపినేని రాంబాబు, తెలుగుదేశం పార్టీ నాయకుడు తాహీర్‌హుస్సేన్, మాజీ ఎంపీటీసీ ఇస్మాయిల్‌షాషా, వెంకట సుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో చోరీ

ఖాజీపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మెయిన్‌బజార్‌లో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. ఖాజీపేటకు చెందిన వీఎస్ మహబూబ్‌హుస్సేన్ గురువారం రాత్రి కమలాపురంలో శుభకార్యం ఉండడంతో అందరు అక్కడికి వెళ్లారు. అయితే అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించి ఇంటిలోని బీరువాల్లో దుస్తులు, ఇతరత్రా సామాగ్రి చిందరవందర చేశారు. నగదు, బంగారం ఏమీ లేకపోవడంతో వారు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం ఇంటఇ తలుపులు తెరిచి ఉన్న విషయాన్ని స్థానికులు యజమానికి తెలుపడంతో హుటాహుటిన ఇంటికి వచ్చి పరిశీలించారు. కాగా చోరీ విషయమై ఫిర్యాదుదారుడు డబ్బులు, బంగారం ఏమీ పోలేదని మాకు కేసు వద్దని చెప్పారని సీఐ మోహన్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జమ్మలమడుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని అయిదు మండలాల్లో రెండవ శనివారం పురష్కరించుకుని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రాజగోపాల్ తెలియజేశారు. నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని మెయింటినెన్స్ పనుల కారణంగా అంతరాయం ఏర్పడనుందని ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని విద్యుత్తు శాఖ ఏడీఈ కోరారు.

ముద్దనూరులో: మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గుర్తించాలన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ముద్దనూరు జూలై11(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని తాడిపత్రి హైవే రోడ్డులోని ఉమ్మారెడ్డిపల్లె వద్ద శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని దేవమ్మ(65)అనే వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన దేవమ్మ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

గ్రామదేవతలకు ఆషాఢ మాస పూజలు

● ఎర్రగుంట్లలో సారెచీరె సమర్పించిన మహిళలు



సారేచీరె తీసుకొస్తున్న మహిళలు, గాజుల అలంకారంలో ఏరువాక గంగమ్మ

ఎర్రగుంట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం రాగానే గ్రామాలు, పట్టణాల్లో సైతం గ్రామదేవతలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తూ ఉంటారు. ఇందులో భాగంగా ఎర్రగుంట్ల నడివూరులోని అంకమ్మ దేవాలయం నుంచి గ్రామ దేవతలకు సారే చీరే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ముందుగా రామాలయం నుంచి మహిళలు ఆలయ కమిటీ వారు ముందుగా పెద్దమ్మతల్లికి సారేచీరే సమర్పించి పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి మేళతాళాలతో ఏరువాక గంగమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చి సారేచీరే మహిళా భక్తులు సమర్పించారు. అనంతరం హారతినిచ్చి భక్తులకు ప్రసాదం పంపిణీచేశారు. అలాగే ముద్దనూరు రోడ్డులోని చౌడేశ్వరీదేవి అమ్మవారికి సారే చీరేను సమర్పించి అక్కడి నుంచి అంకమ్మ దేవాలయానికి చేరుకుని పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఏరువాకగంగమ్మకు గాజుల అలంకరణ: ఆషాఢమాసం పురస్కరించుకుని ఏరువాక గంగమ్మ అమ్మవారికి గాజుల అలంకరణ అత్యంత వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ప్రత్యేకంగా గాజుల దండలను తయారు చేసి శుక్రవారం అమ్మవారికి సమర్పించారు. వందలాది మంది భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అనంతరం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం



ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

కొండాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బ్రాహణపల్లి, వెంకటాపురం, గండ్లూరు, పాతకొండాపురం గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించడంతోపాటు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి కరపత్రాలను అందజేశారు. పథకాలు అందుతున్నాయా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు పీవీ నరసింహారెడ్డి, గండ్లూరుశంకర్‌రెడ్డి, చామలవిష్ణువర్ధన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, బాబు రెడ్డి, గోరిశెట్టిబాబు, వెంకటేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డికొట్టాలలో అర్హులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి



ఆర్‌ఐకి వినతి పత్రం అందజేస్తున్న రెడ్డికొట్టాల గ్రామస్థులు

కాశినాయన జూలై11ఆంధ్రజ్యోతి): రెడ్డికొట్టాల గ్రామంలోని అర్హులైన పేదలందరికి ప్రభుత్వం ఇంటిపట్టాలు మంజూరు చేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు. ఆమేరకు శుక్రవారం గ్రామస్థులందరూ తహసీల్దారు కార్యాలయం వద్దకుపోయి తహసీల్దార్ వెంకటసుబ్బయ్య అందుబాటులో లేకపోవడంతో ఆర్ఐ అమర్‌నాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కింద స్థానికులకు ఇంటిపట్టాలు ఇచ్చిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా రెడ్డికొట్టాల గ్రామంలో జగనన్నకాలనీ అంటూ ఏర్పాటుచేసి స్థానికేతరులైన కేఎస్ కొట్టాల, రంపాడు పంచాయతీలోని వారిని తీసుకొచ్చి రెడ్డికొట్టాలలో 97 ప్లాట్లు వేసుకొని వైసీపీ కార్యకర్తలు వారి అనుచరులు చేజిక్కించుకున్నారని విమర్శించారు. వాటన్నింటిపై విచారణ చేసి అర్హులైన స్థానికంగా ఉన్న వారికి స్థలాలివ్వాలని లేకుంటే పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు.


వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

పోరుమామిళ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ రవిచంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు శుక్రవారం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటట్లాడుతూ మైదుకూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.భరణీకృష్ణ ఆధ్వర్యంలో 132 కేవీ కలసపాడు సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ వరికుంట్ల, పగడాలపల్లె, కేఎస్ కొట్టాల, బాలాయపల్లె సబ్‌స్టేషన్‌లకు వెళ్లే 33 కేవీ వరికుంట్ల ఫీడర్‌లో చెట్ల కొమ్మలు, అరటితోటల్లోని రెమ్మలు తొలగించడం జరిగిందన్నారు. బలమైన గాలుల వలన ఫీడర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దాదాపు 30 కిలోమీటర్ల పొడవున్న వరికుంట్ల ఫీడర్‌లో పోరుమామిళ్ల, బద్వేల్, మైదుకూరు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు శ్రీకాంత్, కుళాయప్ప, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఆర్థిక సాయమందించాలి

పోరుమామిళ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంతోపాటు ప్రతి ఆటో కార్మికునికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయమందించాలని ఏఐటీయూసీ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్‌లు కోరారు. శుక్రవారం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని పార్కు వద్ద ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 21ను రద్దుచేయాలన్నారు. కడపకు, బద్వేల్ ఆర్డీఓ కార్యాలయాన్ని తరలింపు ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. ఆటో కార్మికులకు స్టాండ్ ఏర్పాటుచేయాలని, ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సఫా, ఖాదర్‌బాష, ఈశ్వరయ్య తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



కలసపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండల పరధిలోని 542 మంది బాల బాలికలకు 1716 నోటు పుస్తకాలను శుక్రవారం చిత్తా శౌరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోయస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి మండలంలోని శంఖవరం, ముద్దంవారిపల్లె, పిడుగుపల్లె, లింగారెడ్డిపల్లె, కలసపాడు, రాజుపాలెం, బ్రాహ్మణపల్లెలతో పాటు పలు పాఠశాలల్లో ఈ నోటు పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద సేవాశ్రమానికి రేకులు వితరణ

కాశినాయన, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని వివేకానంద ఆశ్రమ వార్షికోత్సవ సందర్భంగా రూ.22వేల విలువైన 18 రేకులను ఆశ్రమానికి ఇచ్చినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి తెలిపారు. సేవాశ్రమం వార్షికోత్సవ పనుల్లో భాగంగా తనవంతు సాయంగా అందించినట్లు తెలిపారు. ఆమెకు ఆశ్రమ నిర్వాహకుడు రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

కలసపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబల్లపల్లె పంచాయతీ కార్యదర్శి పాండురంగాచారి బదిలీపై వెళ్తుండగా ఆ గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌బీ, నీటి సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, టీడీపీ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి, డీలర్ దాదావలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.